
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట 5
మంగళవారం 21 జనవరి 2025



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్లసబ్‌స్టేషన్‌లో 33కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ప్రజ్ఞాపూర్ విద్యుత్‌శాఖ ఏఈ సత్యం ప్రకటనలో తెలిపారు. కొడకండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని కొడకండ్ల, రిమ్మనగూడ, దాతర్‌పల్లి, బూర్గుపల్లి, రాయవరం, దాచారం గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.



ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను తోటబావికి తీసుకొస్తున్న అర్చకులు

బండారు మల్లన్నా... గండాలు బాపన్నా

- పసుపు సింగిడిగా మారిన కొమురవెల్లి
- ఘనంగా పట్నంవారం పెద్దపట్నం, అగ్నిగుండాలు
- నిప్పుల్లో చిందేసిన శివసత్తులు, పోతరాజులు, భక్తులు
- పులకించిన అశేష భక్తజనం
- భక్తిపారవశ్యంలో ఓలలాడిన కొమురవెల్లి


చంటిబిడ్డను ఎత్తుకుని వీరకోలతో సిగమూగుతున్న భక్తురాలు

చేర్యాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా పట్నంవారాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌కు చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆలయ తోటబావి ప్రాంగణంలో మల్లన్నకు అత్యంత వైభవోపేతంగా పెద్ద పట్నం వేసి అగ్నిగుండాలు నిర్వహించారు. యాదవ పూజారులు పసుపు, కుంకుమ, పచ్చ, బియ్యంపిండి, సునేరు, పంచరంగులతో పెద్దపట్నాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

కొమురవెల్లి మల్లేశా.. శరణు.. శరణు.. అంటూ మల్లన్న నామ స్మరణతో అశేష భక్తజనులు పులకించారు. చేతిలో వీరకోల ధరించి దేవదేవుడి ఆవాహనంతో సిగమూగారు. శివసత్తులు, పోతరాజులు, భక్తులు కణకణమని రగిలే నిప్పుల్లో చిందులేసి మైమరిచిపోయారు. భక్తి పారవశ్యంలో అగ్నిగుండాలు దాటి మొక్కులు తీర్చుకున్నారు.


అగ్నిగుండాలు దాటుతున్న భక్తులు


వంటచెరుకుతో అగ్నిగుండాలను తయారుచేశారు. పెద్దపట్నానికి చిత్రకన్ను అమర్చి గుమ్మడికాయలను అష్ట దిక్పాలకులకు అలంకరించారు. మల్లన్న చరిత్ర, మహిమలను వివరిస్తూ యాదవ పూజారులు ఒగ్గుకథను ఆలపించగా భక్తులు జయజయధ్వానాలు చేయడంతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. భక్తిప్రపత్తులతో వేస్తున్న పట్నాన్ని తిలకిస్తూ అశేష భక్తజనం పులకించిపోయారు. బండారిని ఒంటి నిండా ధరించడంతో పాటు తోటివారిని మల్లన్నగా భావించి పసుపు

మిగతా 7వ పేజీలో...

లెక్క తేల్చేద్దాం..

నేటి నుంచి 24 వరకు గ్రామ, వార్డు సభలు

- ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా అర్హుల పేర్లు ప్రకటన
- రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డు లబ్ధిదారుల జాబితా ప్రదర్శన
- అభ్యంతరాలు, కొత్త దరఖాస్తుల స్వీకరణ



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 20: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో మరో నాలుగు అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ నెల 26 నుంచి అమల్లోకి రానున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికపై ఉమ్మడి మెదక్ జిల్లాలో కసరత్తు తుది దశకు చేరుకుంది. ఆరు గ్యారెంటీలతో పాటు పలు పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. కుటుంబ సర్వే ద్వారా వివరాలను సేకరించారు. తాజాగా దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించేందుకు క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. నేటి నుంచి లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మరో 4 పథకాలకు శ్రీకారం చుడుతోంది. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అర్హులకు లబ్ధి చేకూర్చుడానికి పలుమార్లు సర్వే చేపట్టారు. ఈ పథకాలన్నీ దాదాపు ప్రతీ కుటుంబంతో ముడిపడిఉన్నవే కావడంతో సర్వత్రా చర్చ కొనసాగుతోంది. ఎవరెవరిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారోననే విషయం మరికాసేపట్లో బయట పడబోతున్నది. ఈ నెల 24 వరకు దశలవారీగా అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో సభలను నిర్వహించడానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

రైతులు, కూలీలకు భరోసా అందేనా?

గత ప్రభుత్వ హయాంలో రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు ఏటా రూ.10వేల చొప్పున రైతుబంధు ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం ఎకరాకు రూ.12వేలు ఇవ్వనున్నది. దీనికి సంబంధించి వ్యవసాయంపై ఆధారపడిన రైతుల జాబితాను గుర్తించారు. వీరికి రైతుభరోసా పేరిట ఈ నెల 26న పెట్టుబడి సాయం జమచేయడానికి సన్నాహాలు చేశారు. అదేవిధంగా వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు ఇచ్చేలా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దాదాపు అన్ని గ్రామాల్లో వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో ఉంటారు. వీరందరికి ఏటా రూ.12వేలు ఇవ్వాలంటే అసాధ్యం. అందుకే సర్వే ద్వారా కొందరి పేర్లను ఫైనల్ చేశారు. ఈ జాబితాలో ఎవరెవరు ఉన్నారో నేటి నుండి తేటతెల్లం కాబోతున్నది.

కొత్త రేషన్‌కార్డులపై తికమక

ఇటీవల గ్రామాలు, పట్టణాల్లో సర్వే చేపట్టిన అధికారులకు ప్రజల నుంచి నిలదీతలు తప్పలేదు. కొత్త రేషన్‌కార్డుల కోసం, మార్పులు,చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్నా జాబితా పేర్లు రాలేదని మండిపడ్డారు. అయితే కొత్త రేషన్‌కార్డులపై కుటుంబ సర్వేను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నామని పలుచోట్ల వివరణ ఇచ్చారు. ఈ వివరణలు వివాదాస్పదంగా మారడంతో ప్రభుత్వం పునరాలోచన చేసింది. కుటుంబ సర్వేతోపాటు మీసేవ, ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తులను సైతం పరిగణనలోకి తీసుకుంటామని, దీని ఆధారంగానే కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని స్పష్టం చేయడంతో ఆందోళనలు సద్దుమణిగాయి. నేటి నుంచి జరిగే గ్రామ, వార్డు సభల్లోనూ రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

ఇందిరమ్మ ఇళ్లకు డిమాండ్

ఇందిరమ్మ ఇళ్ల పేరిట ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5లక్షల సహాయం ఇస్తున్న క్రమంలో సొంతింటి కోసం పోటీపడుతున్న వారి సంఖ్య భారీగా ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా ఇళ్ల కోసం 7.40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ఉమ్మడి జిల్లాకు 40వేల ఇళ్లు మాత్రమే కేటాయించింది. ఈ లెక్కన 7 లక్షల దరఖాస్తులను పక్కనపెట్టాల్సి ఉంటుంది. తర్వాతి దశల్లో వీరికి అవకాశం కల్పిస్తారని చెబుతున్నప్పటికీ ఇళ్ల విషయంలో రచ్చ జరిగే అవకాశాలు లేకపోలేదు.

లోటుపాట్లపై బీఆర్ఎస్ ఫోకస్

గ్రామ, వార్డు సభల్లో పథకాల్లో లోటుపాట్లపై నిలదీసేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. అర్హుల పేర్లు జాబితాలో లేకుంటే సభల్లోనే అధికారులను నిలదీసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అంతేగాకుండా ప్రధానంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లపైనే బీఆర్ఎస్ శ్రేణులు దృష్టిపెట్టారు. ఎలాంటి పైరవీలు, పలుకుబడులు లేకుండా అర్హులకే పథకాలు వచ్చేలా చూడాలని మాజీ మంత్రి హరీశ్‌రావు తమ పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. దీనిపై కరపత్రం కూడా విడుదల చేశారు.

గ్రామ, వార్డు సభల నిర్వహణ తీరు

- ముందుగా సభల్లో ప్రత్యేకాధికారిని వేదికపైకి ఆహ్వానించడం
- అధికారులు, ప్రత్యేక ఆహ్వానితులకు వేదిక పైకి పిలుపు
- గ్రామసభ ఎజెండా చదివి వినిపించడం
- ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డుల జారీ గురించి ప్రజలకు వివరించడం
- 4 పథకాలకు సంబంధించి అర్హుల జాబితాను బహిరంగంగా ప్రకటించడం..
- ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించడం
- నూతన దరఖాస్తుల స్వీకరణ
- తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించడం
- సభకు ధన్యవాదాలు తెలుపుతూ ముగించడం

జిల్లా	గ్రామాలు	మున్సిపల్ వార్డులు
సంగారెడ్డి	646	203
సిద్దిపేట	514	115
మెదక్	469	75
మొత్తం	1,629	393

ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరగాలి

- జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్

నంగునూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరిగే చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్ అన్నారు. సోమవారం నంగునూరు మండలం గట్లమల్యాల రాజగోపాల్‌పేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును, ఉద్యోగుల హాజరు పట్టికను, వివిధ ఆరోగ్య కార్యక్రమాల పనితీరును పరిశీలించారు. గ్రామీణ పేద ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై స్థానిక వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లీబిడ్డల సంక్షేమ కార్యక్రమాల పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. పిల్లలకు వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే వివిధ రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించి టీ హబ్‌కు పంపించాలన్నారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక వైద్యులను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం పాటించే వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు నూతనంగా నిర్మిస్తున్న గట్లమల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం నూతన భవనంలోకి కావాల్సిన ఫర్నీచర్ కోసం కాంట్రాక్టర్‌తో చర్చించారు. అసంపూర్తి పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. డీఎంహెచ్‌వో వెంట ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రేవతి, వైద్యాధికారి డాక్టర్ సరిత, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ చలి

- కోహీర్‌లో 8.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

కోహీర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. పది రోజుల క్రితం తగ్గుముఖం పట్టిన చలి మరోసారి తీవ్రమవుతున్నది. 19వ తేదీ నుంచి చలి తీవ్రత మళ్లీ పెరిగింది. కోహీర్ మండలంలో సోమవారం ఉదయం 8.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా మెదక్ జిల్లా శివనూరు లో 12.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. సిద్దిపేట జిల్లాలోని కొండపాకలో 10.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. సోమవారం ఉదయం చలి తీవ్రత ఎక్కువగా ఉంది. చల్లని ఈదురుగాలు కూడా తోడు కావడంతో చలి తీవ్రత పెరిగిపోయింది. దీంతో ప్రజలు ఉదయం పూట చలికి ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మెరుగుగా ఉన్నప్పటికీ రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరుగుతుంది. మరో నాలుగు రోజులు చలి తీవ్రంగానే ఉంటుందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు.

ఉమ్మడిలో సోమవారం ఉదయం నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

కోహీర్ 8.9, అల్గోల్ 9.9, న్యాల్‌కల్ 10.2, మల్‌చేల్మ 10.5, సత్వార్ 10.7, మొగుడంపల్లి 10.9, ఆర్సి పురం 11.0, కంకోల్ 11.1, ఝరాసంగం 11.1, నల్లవల్లి 11.2, కంగ్టి 11.4, దిగ్వాల్ 11.7, అల్మాయిపేట12.0, సిర్గాపూర్ 12.1. జహీరాబాద్ 12.2, లక్ష్మీసాగర్ 12.2, ముక్తపూర్ 12.2, నిజాంపేట్ 12.3, కంది 12,4, గుండ్ల మాచనూరు 12.4, ఫుల్కల్ 12.5, కడ్పల్ 12.5, జిన్నారం 12.5, కల్హేర్12.6, హత్నూర 12.6, పాశమైలారం 12.6, అన్నాసాగర్ 12.7, చౌటకూరు 12.9,, నాగలిగిద్ద 13.0 ఉష్ణోగ్రతలు నమోదు కాగా మెదక్ జిల్లాలోని శివనూరు 12.2, బుడగట్ 12.2, లక్ష్మాపూర్ 12.4, దొంగల ధర్మారం 12.5, రామాయంపేట 12.7, చిప్పల్ తుర్తి 12.7, నాగపూర్ 12.7, కల్లకల్ 12.8, శివంపేట్ 12.7, చేగుంట12.8, మనోహరాబాద్ 12.9, కుల్చారం 12.9, టేక్మాల్ 13.0, ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక సిద్దిపేట జిల్లాలోని కొండపాక 10.9, అంగడికిష్టాపూర్ 11.2, మిరుదొడ్డి మునిగండప్ప 12.0, పోతిరెడ్డిపేట్ 12.1, బేగంపేట్ 12.3, పెద్ద కోడూరు 12.3, నారాయణరావుపేట్ 12.3, చిట్యాల్ 12.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

- భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించింది బీజేపీ
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

7

పల్లె ప్రకృతివనాలను పట్టించుకోరా?

- కనిపించని ఆహ్లాదం..
- ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు
- నిర్వహణ లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు

8

మరోసారి 'డబుల్' లబ్ధిదారుల ఆందోళన

- ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన
- ఆరు గంటల పాటు బైఠాయింపు

గజ్వేల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్‌లో డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులు మరోసారి ఆందోళనకు దిగారు. తమకు గతంలో కేటాయించిన ఇళ్లను అప్పగించాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్‌లోని సమీకృత ప్రభుత్వ భవనంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఉదయం ఒక్కసారిగా ఆందోళనకు దిగడంతో విషయం తెలుసుకున్న గజ్వేల్ సీఐ సైదా అక్కడకు చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఏడాదిన్నరగా తమకు ఇళ్లకు కేటాయించి, అప్పగించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమలో కొందరికి ఇళ్లను ఇచ్చి, మరికొందరికి ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. రెండు నెలల క్రితం ఆర్డీవో తమకు ఇళ్లను ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికీ హామీని నిలబెట్టుకోలేదన్నారు. తమకు కేటాయించిన ఇళ్లకు సంబంధించిన సర్టిఫికెట్లను అందజేయాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్దకు వెళితే తమపై దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇళ్లను కేటాయించి చేతులు దులుపుకుంటే ప్రస్తుత ప్రభుత్వం తమకు ఇళ్లను అప్పగించడంలో తాత్సారం చేస్తుందని మండిపడ్డారు. గజ్వేల్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ అక్కడకు చేరుకుని 220 ఇళ్లు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయని, ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని తెలియజేసి త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. కాగా లబ్ధిదారులు దాదాపుగా ఆరుగంటల పాటు అక్కడే ఉండి తమ ఆందోళనను కొనసాగించారు. ఇప్పటివరకు తొమ్మిది సార్లు లబ్ధిదారులు ఆందోళనకు దిగడం గమనార్హం.


ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

వేంకటేశ్వరాలయ హుండీ లెక్కింపు

సిద్దిపేట కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మోహినిపురలోని శ్రీ పద్మావతీ సమేత వేంకటేశ్వరాలయ హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. దేవాదాయశాఖ సిద్దిపేట డివిజన్ పరిశీలకులు పి. విజయలక్ష్మి, ఆలయ వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్త, చైర్మన్ తిరునగరి వెంకట రమేష్‌విష్ణు పర్యవేక్షణలో వికాస తరంగిణి, కోటి లింగాల సేవా సమితి, ఆలయ అర్చక, సిబ్బంది సమక్షంలో లెక్కింపు చేపట్టారు. 2024 సెప్టెంబరు 30 నుంచి 2025 జనవరి 20 వరకు 113 రోజుల హుండీ ఆదాయం రూ.15,25,194 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పారునంది విశ్వనాథ శర్మ తెలిపారు.


కానుకలను లెక్కిస్తున్న సేవాసమితి సభ్యులు, సిబ్బంది

నీ సంగతేందో చూస్తా..

- ములుగు తహసీల్దార్‌పై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆగ్రహం
- నీ చిట్టా బయట పెడతానంటూ బెదిరింపు
- పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దార్ ప్రవీణ్ ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు
- ఆలస్యంగా వెలుగులోకి...

గజ్వేల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): "నీ సంగతి ఏందో చూస్తా.. నీకు కుర్చీ శాశ్వతమా.. ఖరీజ్‌ఖాతాలు పట్టాలుగా ఎలా మారాయి.. ప్రభుత్వ భూములు పట్టాలుగా ఎలా మారాయో.. చిట్టా బయట పెడతానంటూ సిద్దిపేట జిల్లా ములుగు మండల తహసీల్దార్‌పై ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మిలి శ్రీనివాస్ విరుచుకుపడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ములుగు మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను ఈనెల 17న ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మిలి శ్రీనివాస్ కలిశారు. ఈ సందర్భగా తమకు రావాల్సిన ఆర్‌అండ్‌ఆర్ రిజిస్ట్రేషన్లను చేయాలని కోరగా, అందుకు సంబంధించిన ప్రొసీడింగ్ రాలేదని, వచ్చిన తర్వాత చేస్తానని తహసీల్దార్ తెలిపారు ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. "నీ సంగతి చూస్తా... కలెక్టర్ వద్దకు వెళ్లి నీచిట్టా బయటపెడతానంటూ శ్రీనివాస్ తహసీల్దార్ ప్రవీణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ బదులివ్వడంతో.. "తప్పు కాదు.. తప్పున్నర చేశావ్ అం టూ తిరిగి బదులిస్తూనే ఆగ్రహానికి గురై, బూతులతో ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు. తన విధులకు ఆటంకం కలిగించారంటూ తహసీల్దార్ ప్రవీణ్ ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

కుటుంబసభ్యుల మందలింపుతో ఉరేసుకున్న యువతి

రాయపోల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం వడ్డెపల్లి గ్రామానికి చెందిన గుండారం అంజలి(20) ఆదివారం ఉరేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. ఎస్ఐ రఘుపతి ఆత్మహత్య కారణాలను సోమవారం వెల్లడించారు. అంజలి అదే గ్రామానికి చెందిన ఒకరిని ప్రేమించి అతనితో వెళ్లిపోయింది. ఆమె తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారిని పట్టుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఒకరి జీవితంలోకి మరొకరు రావొద్దని నిర్ణయించుకున్నారు. కొన్ని రోజులుగా అంజలి అదే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతుండగా, కుటుంబసభ్యులు ఆమెను మందలించారు. దీంతో మనస్తాపానికి గురై అంజలి ఉరేసుకుని మృతిచెందింది.

క్రైం కార్నర్

ఒత్తిడి భరించలేక
పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య


సహస్ర(ఫైల్)

తూప్రాన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతుండడంతో ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో సోమవారం చోటుచేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ-2 యాదగిరి కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా అల్వాల్‌కు చెందిన గుర్రపుగారి సుధాకర్, మమత దంపతులు తూప్రాన్ పట్టణంలో నివాసముంటున్నారు. భార్య బీడీలు చేస్తుండగా, భర్త కూలీ పనులు చేస్తున్నాడు. చిన్న కూతురు సహస్ర(15) తూప్రాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. చదువులో వెనుకబడటంతో బాగా చదువుకోవాలని తండ్రి కూతురుకు సూచించారు. ఎంత చదివినప్పటికీ చదువు అబ్బటంలేదని, గుర్తుకు ఉండటంలేదని సహస్ర మథన పడుతూ ఉండేది. సోమవారం ఉదయం తండ్రి కూలీ పనికి వెళ్లగా, తల్లి బీడీలను కార్ఖానాలో ఇచ్చేందుకు వెళ్లింది. పెద్ద కూతురు కళాశాలకు వెళ్లగా, ఇంట్లో ఒంటరిగా ఉన్న సహస్ర (15) ఒత్తిడిని భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఇంటికి వచ్చిన తల్లి గుర్తించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

మినీ వ్యాన్ ఢీకొని యువకుడి మృతి


అనిల్(ఫైల్)

ములుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మినీ వ్యాన్ మోటార్‌సైకిల్‌ను ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన ములుగు మండల పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని క్షీరసాగర్ గ్రామానికి చెందిన గంగమ్మ, నర్సింహులు కుమారుడు అనిల్(18). సోమవారం అనిల్ గ్రామం నుంచి మోటార్‌సైకిల్‌పై వంటిమామిడి వైపు వస్తున్నాడు. కూరగాయల లోడ్‌ను ఖాళీ చేసుకుని వస్తున్న అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ జప్తిసింగాయపల్లి సమీపంలో మోటార్ సైకిల్‌ను ఢీకొన్నది. దీంతో అనిల్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

వంతెనపై నుంచి కింద పడిన లారీ
డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు


సంగుపేట వద్ద వంతెనపై నుంచి పడిన లారీ

జోగిపేట, జనవరి20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా అందోలు మండలం సంగుపేట జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఓ లారీ వంతెనపై నుంచి బోల్తా కొట్టగా, లారీ నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్, క్లీనర్ గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా బేతంచెర్ల నుంచి నాపరాళ్ల(బండలు) లోడ్‌తో లారీ రాజస్థాన్ వెళ్తున్నది. సంగుపేట వద్ద జాతీయ రహదాదరిపై గల వంతెనపైనుంచి అదుపుతప్పి, పల్టీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బ్రిడ్జిపైనుంచి పడిన లారీ నుజ్జునుజ్జైంది. అయితే, లారీ డ్రైవర్ షకీర్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోగా, క్లీనర్ ధర్మేందర్‌సింగ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందిన వెంటనే ఎస్ఐ పాండు సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. 3 గంటల పాటు కష్టపడి గ్యాస్ కట్టర్‌తో క్యాబిన్‌ను కోసి డ్రైవర్ షకీర్‌ను బయటకు తీశారు. వారిని జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సచేయించి, మెరుగైన చికిత్సకోసం సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ పాండు తెలిపారు. కాగా, శివమాలలో ఉన్నప్పటికీ.. విధి నిర్వహణ మరువక.. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను వెలికితీసిన హోంగార్డు శ్రీశైలంను పలువురు అభినందించారు.

తాలెల్మ హత్య ఘటన ఛేదన
సెల్‌ఫోన్, బైక్ కోసం ఘాతుకం
ఇద్దరి నిందితులకు రిమాండ్

జోగిపేట, జనవరి20(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్, మోటార్ సైకిల్ కోసం ఓ యువకుడి గొంతుకోసి, ఆపై బండరాతితో మోదీ హత్య చేసిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు జోగిపేట సీఐ అనిల్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈనెల12న మండలంలోని తాలెల్మ గ్రామ శివారులో నాదులాపూర్‌కు చెందిన కర్రోల్ల శ్రీనివాస్ దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కర్రోల్ల శ్రీనివాస్‌కు, జోగిపేటకు చెందిన బావ, బావమరుదులు సద్దాంహుస్సేన్, యూనిస్‌లకు కల్లు తాగే అలవాటుంది. వీరంతా తాలెల్మ గ్రామంలోని కల్లు దుకాణానికి తరచుగా వెళ్లేవారు. ఈ క్రమంలో సద్దాం, యూనిస్‌తో శ్రీనివాస్‌కు పరిచయం ఏర్పడింది. వారు ముగ్గురు ఈనెల 12న తాలెల్మ శివారులోని చెక్‌డ్యాం వద్ద నిర్జన ప్రదేశంలో కల్లు తాగుతున్నారు. తనకున్న అలవాటు ప్రకారం శ్రీనివాస్ సెల్‌ఫోన్‌లో లూడో గేమ్ ఆడుతుండగా, తాము కూడా ఆడతానని, ఓడిన వారు గెలిచిన వారికి మద్యం తాగించాలని పందెం కాసుకున్నారు. ఈక్రమంలో ఓడిపోయిన శ్రీనివాస్, యూనిస్‌తో కలిసి మర్వెల్లిలోని మద్యం, తినుబండారాలు తీసుకుని రాగా, సద్దాం కల్లు తీసుకుని అక్కడికి చేరుకున్నారు. ముగ్గురు తాగుతుండగా శ్రీనివాస్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్, మోటార్‌సైకిల్‌ను తస్కరించి అమ్ముకోవాలని సద్దాం, యూనిస్‌లు ఆశపడ్డారు. వీరిద్దరూ కలిసి బీర్ బాటిల్‌ను పగులగొట్టి శ్రీనివాస్ పీక కోశారు. ఆపై బండరాతితో శ్రీనివాస్ తలపై మోదీ హత్య చేశారు. మృతుడి సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌ను తీసుకుని ఒకరు, సొంత బైక్‌ను తీసుకుని ఇంకొకరు హైదరాబాద్ వెళ్లి బైక్‌ను అమ్మేశారు. దర్యాప్తులో భాగంగా సేకరించిన సమాచారం మేరకు సద్దాంహుస్సేన్, యూనిస్‌ను విచారించగా నేరాన్ని అంగీకరించారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

కొండపాక శివారు అడవిలో మంటలు
అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు


అడవిలో అంటుకున్న మంటలు

కొండపాక, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కొండపాక శివారులోని అటవీ ప్రాంతంలో సోమవారం మంటలు చెలరేగాయి. విషయాన్ని తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అప్రమత్తం కావడంతో పెనుముప్పు తప్పింది. అటవీ అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సుమారు పది ఎకరాలకు మంటలు వ్యాపించినట్లు తెలిసింది. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఇక్ర మొయిద్దీన్, సిద్దిపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మ, సెక్షన్ ఆఫీసర్‌లు రమేష్, ముజిబుద్దీన్, బీట్ అధికారులు చంద్రశేఖర్, జ్యోతి, రవికిరణ్ తదితరులు పచ్చిచెట్ల కొమ్మలను పట్టుకుని మంటలను ఆర్పారు. మంటలు వ్యాపించకుండా రెండు గంటల పాటు శ్రమించారు.


పట్నం, అగ్నిగుండాలను తిలకిస్తున్న భక్తులు


సిగమూగిన కొమురవెల్లి

కొమురవెల్లి క్షేత్రం బండారిమయంగా మారింది. భాగ్యనగర యాదవ పూజారులు పంచరంగులతో పెద్దపట్నాన్ని తీర్చిదిద్ది.. మల్లన్న మహిమల ఒగ్గుకథలను హోరెత్తించగా.. వీరకోలలు చేతపట్టి శివసత్తులు సిగాలూగారు. తోటబావి ప్రాంగణం మల్లన్న నామస్మరణతో మార్మోగింది. భక్తులు అగ్నిగుండాలను దాటి స్వామి వారి సన్నిధికి దారి కట్టారు. మల్లన్నను దర్శించుకుని తన్మయత్వం పొందారు.


పట్నం, అగ్నిగుండాలు దాటడం ప్రారంభిస్తున్న అర్చకులు, యాదవ సంఘం ప్రతినిధులు


వీరకోలలతో వీరంగమాడుతున్న ఆచారవంతుడు


ఒగ్గుకథ చెబుతున్న యాదవ కళాకారుల బృందం


శివమెత్తుతున్న సాధువు


అగ్నిగుండాలను దాటి తోటబావి నుంచి ఆలయానికి వెళ్తున్న భక్తులు




వీరకోలలతో శివసత్తులు, ఝుతార్ఝుటంతో సిగమూగుతున్న భక్తురాలు

బండారు మల్లన్నా.. గండాలు బాపన్నా

5వ పేజీ తరువాయి

పూయడంతో ఆలయ పరిసరాలన్నీ పసుపుమయంగా మారింది. పట్నంవేయడం, అగ్నిగుండాలు కాలడం పూర్తికాగానే గర్భాలయం నుంచి అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, భాస్కర్, రవి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి పట్నంచుట్టూ ప్రదక్షిణలు చేశారు. యాదవులు గుమ్మడికాయలను బలిహరణ చేయగానే అర్చకులు అగ్నిగుండాలను దాటడం ప్రారంభించారు. అనంతరం భక్తులు మల్లన్నను స్మరిస్తూ అగ్నిగుండాలను దాటారు. అక్కడి నుంచి నేరుగా ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. శివసత్తులు, భక్తులకు ఆలయ సంప్రదాయం ప్రకారం కనుములు అందించి సత్కరించారు. పలువురు భక్తులు బెల్లం పానకం, నీళ్ల ప్యాకెట్లను, మరికొందరు అన్నప్రసాదం వితరణ చేశారు. ఇంకొందరు బండారిని పంపిణీ చేశారు. అనంతరం భక్తులు కొండపోచమ్మ దర్శనానికి తరలివెళ్లారు. ఈవో రామాంజనేయులుతో పాటు ధర్మకర్తలు పాల్గొన్నారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ ఎల్.శ్రీను ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టారు. తోటబావి ప్రాంగణంలో భక్తులగుంపులో తోపులాటకు గురైన ఓ వృద్ధురాలు స్పృహతప్పి పడిపోయింది. దీంతో ఏఆర్ కానిస్టేబుల్ రజనీకాంత్ బయటకు ఎత్తుకుని వచ్చి వైద్య సిబ్బందితో చికిత్స అందించారు.

అమ్మా బైలెల్లినామో..

- కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ చెంతకు భక్తులు
- ఘనంగా జాతర ప్రారంభం

జగదేవ్‌పూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కొండపోచమ్మ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో ఆనవాయితీగా కొండపోచమ్మ సన్నిధికి చేరుకున్నారు. దీంతో మండలంలోని తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలోని ఆలయానికి వచ్చే రహదారి మధ్యాహ్నం నుంచి వాహనాలతో కిక్కిరిసిపోయింది. భక్తులు కొత్త కుండల్లో నైవేద్యాన్ని వండి, డప్పుచప్పుల మధ్య బోనమెత్తి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. శివసత్తుల సిగాలు, పోతరాజుల నృత్యాలతో కొండపోచమ్మ క్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. అమ్మవారికి బోనం నివేదించి, ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో రవికుమార్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించగా, ట్రాఫిక్‌జామ్ తలెత్తకుండా చర్యలు చేపట్టారు. జిల్లా ఒకటో సెషన్ న్యాయాధికారి శ్రావణి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న న్యాయాధికారి శ్రావణి


ఆలయానికి వచ్చే తిగుల్ నర్సాపూర్ దారిలో వాహనాలు

అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

- భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించింది బీజేపీ
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అడుగడుగునా అవమానించిందని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు అన్నారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడూ అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంబేడ్కర్‌కు భారతరత్న అవార్డును ప్రకటించిన విషయం ప్రజలకు తెలిసిందేనన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డిని అధిష్ఠానం ప్రకటించిందన్నారు. ఆయన గెలుపు కోసం పట్టభద్రులు, బీజేపీ శ్రేణులు మద్దతు తెలపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని ఆరోపించారు. కాంగ్రెస్ చేసిన ఆరు గ్యారంటీల మోసాన్ని జనంలో ఎండగడుతూ భారత్ సంవిధాన్ గౌరవ్ దివస్ కార్యక్రమాన్ని వారం రోజుల పాటు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, నాయకులు మందుల నాగరాజు, కసిని వాసు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అనాజీపూర్‌లో చాళుక్యుల నాటి ఆనవాళ్లు


వినాయకుని విగ్రహం

రాయపోల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం అనాజీపూర్ పరిధిలో చాళుక్యుల కాలం నాటి విగ్రహాలను గుర్తించినట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం ఔత్సాహిక పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన వివరాలను వెల్లడించారు. అనాజీపూర్ గ్రామానికి కిలోమీటరు దూరంలో ప్యాట ప్రాంతంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వెయ్యి ఏళ్ల క్రితం నాటివిగా భావిస్తున్న నంది, వినాయకుడు, నాగశిల విగ్రహాలను కనుగొన్నారు. అనాజీపూర్ సమీపంలో 17వ శతాబ్దం నాటి శైలిని పోలిన వీరగల్లు శిల్పం, పోచమ్మ ఆలయం వద్ద మరో వీరగల్లు శిల్పాన్ని గుర్తించినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు
చికిత్స నిమిత్తం వికారాబాద్ జిల్లా మర్పల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు


కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన ప్రణయ్‌కుమార్

కోహీర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బోయిన సిద్ధప్ప కుమారుడు ప్రణయ్‌కుమార్ ఇంటి బయట ఆడుకుంటుండగా ఒకేసారి కుక్కల గుంపు బాలుడిపై దాడి చేశాయి. బాలుడి కాళ్లు, చేతులు, ముఖంపై కరవడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు అక్కడ నుంచి కుక్కలను తరిమివేశారు. అప్పటికే తీవ్రగాయాలైన ప్రణయ్‌కుమార్‌ను హుటాహుటిన వికారాబాద్ జిల్లాలోని మండల కేంద్రమైన మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా పలువురు నాగిరెడ్డిపల్లి గ్రామస్థులు మాట్లాడుతూ.. తమ గ్రామానికి ఎక్కడ నుంచి వచ్చాయో ఏమో కానీ దాదాపు 200 వరకు కుక్కలు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. కుక్కలు ఎక్కువగా సంచరిస్తూ ఉండడం వల్ల పిల్లలను ఆరుబయటకు పంపాలంటే భయమేస్తుందన్నారు. కుక్కల బెడదల నుంచి గ్రామస్థులను రక్షించాలని పలమార్లు అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదని వారు వాపోయారు.

బస్సులో ప్రయాణిస్తూ
రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ మృతి

అక్కన్నపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి హుస్నాబాద్‌కు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న రిటైర్డ్ ఆర్టీసీ సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడిగ వద్ద ఆకస్మికంగా మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన చుంచు వెంకటయ్య(65) ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేసి రిటైడయ్యారు. హైదరాబాద్‌కు భార్య లక్ష్మితో ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ఆకస్మికంగా మృతిచెందారు. ఆయనకు భార్య లక్ష్మితోపాటు కుమార్తె ఉన్నారు. వెంకటయ్య మృతిచెందడంతో ఆర్టీసీ బస్సును అక్కడే నిలిపివేశారు. బంధువులు మృతదేహాన్ని తీసుకురావడానికి వెళ్లారు.

కబేళాకు తరలిస్తున్న 34 గోవుల పట్టివేత

ములుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారి నుంచి కబేళాకు తరలిస్తున్న గోవులను సోమవారం తెల్లవారుజామున భజరంగ్‌దళ్ సభ్యులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. భజరంగ్‌దళ్ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్‌కు 34 గోవులను కబేళాకు తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు ములుగు భజరంగ్‌దళ్ సభ్యులు పట్టుకున్నారు. వాహనాన్ని ఆపగా, డ్రైవర్ దిగి పారిపోయాడు. వెంటనే ఈ గోవులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, పశు వైద్యాధికారులను రప్పించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం గోవులను గోశాలకు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. గోవుల తరలింపుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పల్లె ప్రకృతివనాలను పట్టించుకోరా?

- కనిపించని ఆహ్లాదం..
- ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు
- నిర్వహణ లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు
- సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లో దయనీయస్థితిలో ప్రకృతి వనాలు



నిర్వహణలేక అధ్వానంగా రాఘవాపూర్ పల్లె ప్రకృతివనం

నారాయణరావుపేట మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనం

పల్లె ప్రకృతివనంలో పడిఉన్న ఖాళీ మద్యంసీసాలు

సిద్దిపేట రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను సైతం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు అందుకు భిన్నంగా దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లో పల్లె ప్రకృతి వనాల నిర్వహణను అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో ఆహ్లాదం మాటేమోగానీ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగి అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారాయి. వాటి ఏర్పాటు, నిర్వహణ కోసం వెచ్చించిన రూ.లక్షలాది నిధులు బూడిదలో పోసిన పన్నీరులా తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్వహణ సరిగా లేక పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, గడ్డితో దర్శనమిస్తున్నాయి.

సర్పంచుల పదవీ కాలంతోనే నిర్వహణ కూడా..

సిద్దిపేట రూరల్ మండలం, నారాయణరావుపేట మండలాల్లోని గ్రామాల్లో గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో ప్రకృతి వనాలను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. అందులో వివిధ రకాల మొక్కలను నాటి చుట్టూ ముళ్లకంచె ఏర్పాటు చేసి వాటి నిర్వహణకు కొంతకాలం పాటు కూలీలను నియమించి నిర్వహణ చేపట్టారు. సర్పంచ్‌ల పదవీ కాలంలో గ్రామ పంచాయతీల మధ్య పోటీ తత్వంతో పల్లె పకృతి వనాల నిర్వహణ భేషుగ్గా ఉండేది. వారి పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనలో వాటి నిర్వహణ గాలి కొదిలేశారని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పకృతి వనాల రక్షణకు వేసిన కంచె ధ్వంసం కావడంతో మూగజీవల సంచారం పెరిగిపోయి నాటిన మొక్కలు ధ్వంసమవుతున్నాయి. మరికొన్ని చోట్ల అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాలుగా మారాయి. గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

రూ.లక్షల నిధులు వృథా..

ఉపాధి హామీ నిధుల కింద ఒక్కో ప్రకృతి వనానికి రూ.4 నుంచి 6 లక్షలవరకు నిధులు మంజూరు చేసి సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లోని గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను తీర్చిదిద్దేందుకు లక్షల రూపాయలను ఖర్చు చేసిన ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. అప్పట్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసేందుకు ఎంతో హడావుడి చేసిన అధికారులు, వాటి నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

కన్నెత్తిచూడని అధికారులు

మొదటి నుంచి పలు గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసేందుకు కొందరు సర్పంచ్‌లు పెద్దగా ఆసక్తి చూపించ లేదు. అయితే ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో గత్యంతరం లేని పరిస్థితుల్లోనే పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. మొదట కొన్నాళ్ల పాటు నిర్వహణపై కొంత ఆసక్తి చూపించినా గ్రామ పంచాయితీ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రకృతివనాల పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రత్యేకాధికారులు అటువైపు కన్నెత్తయినా చూడడం లేదు. ఇక గ్రామ కార్యదర్శులైతే అసలు పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఎండిపోతున్న మొక్కలు

ఆహ్లాదాన్ని పంచేందుకు పూల మొక్కలను నాటినా.. ప్రస్తుతం అవి ఎక్కడా కనిపించడం లేదు. వర్షాకాలం ముగియడంతో మొక్కలకు నీటిని సరఫరా చేసే నాథుడే లేక వాడుముఖం పట్టి ఎండిపోతున్నాయి. కొంతమంది అధికారులు ఎంతో కొంత ఆదాయం ఉన్న పనులవైపు మొగ్గు చూపుతూ పల్లె ప్రకృతి వనాల జోలికే వెళ్లడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మొక్కల మధ్య పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో విష సర్పాల సంచారంతో గ్రామస్థులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు.

నిర్వహణకు నిధుల కొరత సమస్య



గతంలో ఉపాధిహామీ కింద వాచ్ అండ్ వార్డ్‌లు ఉండేవి. నిర్వహణకు ఉపాధిహామీ నుంచి బుష్ కట్టింగ్ కోసం నిధులు వచ్చేవి. ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలు గ్రామ పంచాయతీలకు ఇచ్చారు. కొన్ని నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధుల కొరత ఉంది. పకృతి వనాల పర్యవేక్షణ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించాం. పకృతి వనాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరిగేలా చూస్తాం. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పకృతి వనాల నిర్వహణ చేపడతాం.

- మురళీధర్ శర్మ, ఎంపీడీవో, సిద్దిపేట రూరల్

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేట క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని మనోవేదనతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇమాంబాద్‌కు చెందిన శివరాత్రి చంటి (21)కి ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. నాలుగు నెలలుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో పెద్దల సూచన మేరకు చంటి తమ కాపురాన్ని పట్టణంలోని రేణుకానగర్‌కు మార్చాడు. పది రోజుల క్రితం భార్యభర్తల మధ్య మళ్లీ గొడవ జరగడంతో అతడి భార్య పుట్టింటికి వెళ్లింది. ఆమెను తీసుకరావడానికి యత్నించిన చంటి ఆదివారం రాత్రి భార్యతో ఫోన్‌లో గొడవపడి రేణుకానగర్‌లోని తన ఇంటో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బ్యాటరీల దొంగకు రిమాండ్



సింగాయిపల్లి చౌరస్తా వద్ద బ్యాటరీల దొంగను పట్టుకున్న పోలీసులు

వర్గల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : వరుసగా దొంగతనాలకు పాల్పడుతూ ఆటో బ్యాటరీలు చోరీ చేస్తున్న వ్యక్తిని గౌరారం పోలీసులు పట్టుకున్నారు. సోమవారం గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గత శనివారం, ఆదివారం రోజున వర్గల్ గ్రామంలో 2 ఆటోల బ్యాటరీలతో పాటు నగరం తండాలోని ఒక ఆటో నుంచి బ్యాటరీ దొంగతనం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారి సింగాయిపల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టగా హైదరాబాద్, న్యూ బోయిన్‌పల్లి, గణేశ్‌నగర్‌కు చెందిన పెరాల సందీప్ అనే వ్యక్తి కారును తనిఖీ చేయడంతో కారు వెనుక భాగండిక్కీలో బ్యాటరీలో ఉన్నాయి. అతడిని విచారించగా షామిర్‌పేట్ పీఎస్ పరిధిలో ఒక బ్యాటరీ, ములుగు పీఎస్ పరిధిలో 9 బ్యాటరీలు, గౌరారం పీఎస్ పరిధిలోని 3 దొంగతనం చేసినట్లు నేరం అంగీకరించాడని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 30మందికి జరిమానా

గజ్వేల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 30మందికి రూ.17,000 జరిమానా విధిస్తూ గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పునిచ్చారు. గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల గజ్వేల్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనతనిఖీలు జరుపగా, 30మంది వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి వారికి జరిమానా విధించారు.

జాలిగామలో వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

గజ్వేల్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాలిగామలో సోమవారం వ్యక్తి అదృశ్యం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కాసమైన సాగర్(38) ప్రస్తుత నివాసం గజ్వేల్ ఉంటూ ఈ నెల 17వ తేదీన రాత్రి భార్యతో గొడవపడ్డాడు. 19వ తేదీ ఉదయం నుంచి అదృశ్యమయ్యాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



ఇర్కోడులో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సిబ్బందికి సూచించారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామంలో అధికారులు చేపట్టిన సర్వేను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేయాలని, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీటీ రాజేశం, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి నవ్య పాల్గొన్నారు.

● సిద్దిపేట టౌన్, జనవరి20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో జాప్యం వహించవద్దని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ మున్సిపల్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికపై 43 వార్డులకు చెందిన అధికారులు, మున్సిపల్‌లోని అన్ని విభాగాల సిబ్బందితో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మంగళవారం నుంచి వార్డు సభలను నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో వార్డు సభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. వార్డు సభ నిర్వహించినప్పుడు అర్హుల వివరాలను చదివి వినిపించాలని, ఎవరైనా అభ్యంతరాలు ఉంటే సేకరించాలని సూచించారు. ఆహార భద్రత కార్డులు ఇదివరకే దరఖాస్తు పెట్టుకుని, లిస్టులో రాని వారెవరైనా ఉంటే వారి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. వార్డు సభకు అందరూ హాజరయ్యేలా సమాచారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతీ వార్డు సభ వద్ద మంచినీటి సదుపాయం, అవసరమున్న ప్రాంతంలో టెంట్, కుర్చీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొండపాక, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందగోరేవారు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ లో చేసుకోవాలని ప్రభుత్వ గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ శివప్రసాద్ తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశం కోసం ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కవి వెంకట్‌కు సన్మానం



ప్రశంసాపత్రం అందుకుంటున్న వెంకట్

చేర్యాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన పద్యకవి బి.వెంకట్ రాష్ట్ర సంగీత కళాసాహిత్య సన్మానం అందుకున్నారు. కవిత్వం, సాహిత్యంలో రాణించడాన్ని గుర్తించిన భారత్ వికాస పరిషత్‌వారు సోమవారం హైదరాబాద్ కూకట్‌పల్లిలో నిర్వహించిన సంగీత, సాహిత్య సాంస్కృతికోత్సవంలో ప్రశంసాపత్రం అందించారు.

ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలు

సిద్దిపేట కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్గనైజేషన్ లెవల్ స్కిల్స్ అండ్ స్పోర్ట్స్ కాంపిటీషన్ సిద్దిపేటలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ నెల 21, 22వ తేదీల్లో జరగనున్న పోటీల్లో ఎర్త్ ఫౌండేషన్ దత్తత తీసుకున్న పాఠశాలల విద్యార్థులు పాల్గొనున్నారు. వివిధ జిల్లాల్లో 33 పాఠశాలలను ఎర్త్ ఫౌండేషన్ దత్తత తీసుకుంది. ఇందులో సిద్దిపేట జిల్లాలో 6 పాఠశాలలున్నాయి. జిల్లాలోని 6, మహారాష్ట్ర నుంచి 3 పాఠశాలలతో కలిపి మొత్తం 9 ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 220 మంది విద్యార్థులు 21 అంశాల్లో పోటీ పడనున్నారని నిర్వాహకులు తెలిపారు.

కథల పోటీల ద్వారా భాషపై పట్టు

కోహెడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కథల పోటీల ద్వారా తెలుగు భాషపై మరింత పట్టు సాధించడం జరుగుతుందని జిల్లా సెక్టోరియల్ అధికారి ఎన్ భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కథల పోటీలో విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. అక్షర సేద్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంక్రాంతిపై ఏటా జిల్లాస్థాయిలో ఒక పాఠశాలను ఎంపిక చేసుకొని కథలు పోటీలను నిర్వహిస్తారు. ఈసారి శనిగరం ఉన్నత పాఠశాలను ఎంపిక చేసుకొని 128 మంది విద్యార్థులకు వేర్వేరు కథలను ఇచ్చారు. ఈ నెల 7న ఈ పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో నిలిచిన పదిమంది విద్యార్థులకు ఎంపిక చేయగా వారికి ఎంఈవో పద్మయ్య, హెచ్ఎం సరళ చేతుల మీదుగా నగదుబహుమతులను అందజేశారు. మరో ఐదుగురికి కన్సోలేషన్, మిగతా విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఫౌండేషన్ తరఫున పాఠశాల లైబ్రరీకి 50 కథల పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సరళకు అందజేశారు. బేతి భాస్కర్, అక్షర సేద్యం ఫౌండేషన్ అధ్యక్షుడు బైతి దుర్గయ్య, ఎంఈవో రాళ్లబండి పద్మయ్య, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

23న జిల్లా స్థాయి సీనియర్, సబ్ జూనియర్ కబడ్డీ ఎంపికలు

గజ్వేల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న సిద్దిపేట జిల్లా స్థాయి కబడ్డీ సీనియర్ పురుషుల విభాగంలో, సబ్ జూనియర్ బాల, బాలికల విభాగంలో ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి చిన్న సంతోష్, ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్ సోమవారం తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో ఈ నెల 23న ఉదయం పది గంటలకు ఈ ఎంపికలను నిర్వహించనున్నట్టు తెలిపారు. బోనఫైడ్, ఆధార్ కార్డులతో సబ్ జూనియర్ బాల, బాలికలు హజరుకావాలని, 16ఏళ్లలోపు వయస్సు ఉండాలని, 55కిలోలకు మించకూడదన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 చెల్లించి సెలక్షన్లలో పాల్గొనాలని తెలిపారు. సీనియర్ పురుషుల విభాగంలో 85కిలోలకు మించకుండదని, ఎంపికైన అభ్యర్థులు ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు అదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అలాగే సబ్ జూనియర్ బాల, బాలికలకు సంబంధించిన పోటీలు వికారాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9550847409, 8919679704 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇందిరమ్మ 'మోడల్ హౌజ్'కు భూమి పూజ



ఎంపీపీ కార్యాలయంలో ఇందిరమ్మ మోడల్ హౌజ్ పనులకు భూమిపూజ చేస్తున్న అధికారులు, కమిటీసభ్యులు

హుస్నాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించేందుకు సోమవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మోడల్ హౌజ్ నిర్మాణానికి అధికారులు, ఇళ్ల నిర్మాణ కమిటీ సభ్యుల సమక్షంలో భూమిపూజ చేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్దిదారులు తమ ఇంటి నిర్మాణానికి సంబంధించి ఏ విధంగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందనే విధానంపై ఎంపీడీవో ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈనెల 26 నుండి రైతు బరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషకార్డుల పంపిణీ, భూమి లేని నిరుపేదలకు రూ. 12 వేల పథకం అమలు వంటి కార్యక్రమాలపై గ్రామ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ నెల 21 నుండి 25 వరకు నాలుగు పథకాలపై గ్రామాలవారీగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రథమంగా బేస్‌మెంట్ లెవల్ వరకు రూ. 1 లక్ష, స్లాబ్ లెవల్ వరకు రూ. 2 లక్షలు, ఇంటి అస్తర్‌కారు కోసం రూ. 1 లక్ష, స్లాబ్ లెవల్‌లో రూ. 1 లక్ష, ఇంటి నిర్మాణం పూర్తైన తర్వాత రూ. 1 లక్షల ఇలా రూ. 5 లక్షల వరకు చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బంక చందు, కౌన్సిలర్లు వల్లపు రాజు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 12లక్షల మందికి రేషన్ కార్డులు ఇవ్వాలి



గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్/వర్గల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం స్వీకరించిన దరఖాస్తులలో అర్హులుగా తేలిన 12లక్షల మందికి రేషన్ కార్డులను ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన పేరుతో స్వీకరించిన దరఖాస్తుల్లో 12లక్షల మంది తమకు రేషన్ కార్డులు లేవని దరఖాస్తు చేసుకున్నారని వారందరికీ రేషన్ కార్డులను అందజేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా 11 లక్షల మంది వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లను అందజేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీలో భాగంగా రూ.2 లక్షలను రైతులందరికీ మాఫీని వర్తింపజేయాలన్నారు. ఈ విషయమై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గ్రామసభల్లో ప్రజలు ప్రశ్నించాలని, అందరికీ రేషన్‌కార్డులు, రుణమాఫీ, పింఛన్లు అందే వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, మార్కూక్ మాజీ ఎంపీపీ పాండుగౌడ్, నాయకులు ఉమర్ తదితరులున్నారు. వర్గల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అయ్యగాల్ల యాదగిరి భార్య జ్యోతి మరణించడంతో అతడికుటుంబ సభ్యులను వంటేరు ప్రతాప్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. అలగే మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుల యూసుఫ్ జానీ ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు.

'విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి'



నంగునూరులో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ

నంగునూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ రోడ్డు నిబంధనలు తెలుసుకోవాలని రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసిఫ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సోమవారం నంగునూరులో పోలీసు సిబ్బందితో కలిసి హైస్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు గ్రామ ప్రధాన వీధుల్లో ట్రాఫిక్ నిబంధనలపై ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి); పాడి రైతులు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్య అధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్ సూచించారు. సోమవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖల సంయుక్తంగా గోపాలమిత్ర సహకారంతో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు, గర్భధారణ సూదులు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, గేదలకు, దూడలకు నట్టల మందులు ఉచితంగా అందజేశారు. రైతు ప్రోత్సాహక పోటీలలో గెలుపొందిన పాడి రైతులకు పశుగణాభివృద్ధిసంస్థ ద్వారా ప్రోత్సాహకాలు, బహుమతులు అందజేశారు.


స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

కొండపాక, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త సిద్దురెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొండపాక శ్రీసత్యసాయి ప్రశాంత్ నికేతన్ జూనియర్ కాలేజీలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో కాలేజీ చైర్ పర్సన్ పూర్ణిమ అధ్యక్షతన నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతరం స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని మంచి కార్యక్రమాలు చేసి సమాజానికి దిక్సూచిగా నిలవాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ తెలంగాణ జాయింట్ సెక్రెటరీ వైద్యనాథ్, నెహ్రూ యువ కేంద్ర అడ్వైజర్ చంటి , శాసనసభ సినిమా హీరో ఇంద్రసేన, డైస్ ఫిలిం డైరెక్టర్ హర్షిత యువ కేంద్ర కోఆర్డినేటర్ రంజిత్ రెడ్డి, రోటరీ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


సమగ్ర సమాచారం కోసం అపార్ కార్డు

దౌల్తాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్ర సమాచారం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అపార్‌కార్డుకు ఎంతో ప్రాముఖ్యమైందని ఎంఈవో గజ్జెల కనకరా, జిల్లా టెక్నికల్ పర్సన్ వీరేశం, శ్రీనాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర జడ్పీ పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి అపార్ కార్డుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ. జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ఆధార్ తరహాలో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రతీ విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఒక ప్రత్యేక కార్డు అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. అపార్ కార్డు ఆన్‌లైన్‌లో పొందుపరిచినప్పుడు భవిష్యత్ విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా జనరేట్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.


ఉపాధ్యాయుడిపై దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలి



మర్కుక్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



వర్గల్ మండలం చౌదరిపల్లి జడ్పీహెచ్ఎస్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



రాయపోల్: బేగంపేట పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి)

గత నెల 23న రంగారెడ్డి జిల్లా తుక్కుగుడ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కంబాలపల్లి రాములుపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి చేసిన సంగతి తెలిసిందే. దాడిని ఖండిస్తూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు సోమవారం జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడిపై దాడికి పాల్పడిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, మాచాపూర్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనవ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడిపై దాడి బాధాకరమని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు పన్యాల జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. వర్గల్ మండలం చౌదరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల అవరణలో ఉపాధ్యాయులతో కలిసి జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అదేవిధంగా మర్కుక్, కొండపాక, రాయపోల్, జగదేవ్‌పూర్ మండలాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

హుస్నాబాద్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సోమవారం హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు ఆర్టీసీ విశ్రాంత కార్మికులు వినతిపత్రం సమర్పించారు. రిటైర్డు కార్మికులకు పింఛన్లు లేవని పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా గుర్తించకుండా, తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, హెల్త్ కార్డులు ఇప్పించాలని కోరారు.